సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



బీ-ఫాం గండం

అలంపూర్ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థులకు బీఫాం గండం నెలకొంది.

వివరాలు 8లో ▸



ముమ్మరంగా తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
44.7 /22.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నంవేళ ఉక్కపోత ఉంటుంది. తీవ్రమైన వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ అన్నారు. మండలంలోని మంతటి గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఇంటింటికెళ్లి వివరాలను సేకరించారు. అలాగే వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలతో పాటు 8.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంఘ విద్రోహ శక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడమే పోలీసు శాఖ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్‌ఐలతో పాటు 90 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



వెల్దండ: మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికిగాను ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. మొత్తం 360 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 292 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను ఆర్సీఓ నాగార్జునరావు పర్యవేక్షించారు. సరస్వతి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి చారకొండ ఎంపీపీ



చారకొండ: బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ నిర్మలతో పాటు మండల ముఖ్య నాయకులు కాంగ్రెస్ గూటికి చేరారు. జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, టీపీసీసీ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధిని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ గుర్వయ్యగౌడ్, మాజీ సర్పంచులు విజేందర్‌గౌడ్ నరేష్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ రాణి, నాయకులు నరేందర్‌రెడ్డి, రాజేష్‌గౌడ్ ఉన్నారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలిందని చెప్పవచ్చు.

ప్రచార హోరు..

లోక్‌సభ ఎన్నికలకు సమీపిస్తున్న గడువు

- సభలు, సమావేశాలతో హోరెత్తిస్తున్న ప్రధాన పార్టీలు
- ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లోనూ అదే జోరు
- రాజకీయ వేడిని పుట్టిస్తున్న విమర్శలు, ప్రతి విమర్శలు
- ప్రధాన అస్త్రంగా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. బహిరంగ సభలు, భారీ రోడ్‌షోలతో తమ ప్రాబల్యాన్ని చాటుతూ రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ క్రమంలో గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతూ వినూత్న ప్రచార శైలిని అనుసరిస్తున్నాయి. ఓవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఇక్కడి రెండు పార్లమెంట్ స్థానాలను చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పలుమార్లు పర్యటించి కేడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. మరోవైపు మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించి గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. బీజేపీ సైతం బడా నేతలు, ఇతర రాష్ట్రాల సీఎంలను రంగంలోకి దింపి ప్రజల దృష్టిని తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తోంది. వచ్చే నెల 13న ఎన్నికలు జరగనుండగా.. గడువు సమీపిస్తున్న కొద్దీ రోజురోజుకూ ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది.

మండుటెండలోనూ తగ్గని జోరు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. భగభగ మండుతున్న ఎండలోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఉదయం వేళల్లో గ్రామాల్లో పర్యటనలతో మొదలుపెట్టి మధ్యాహ్న సమయాల్లో విభిన్న వర్గాలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళ తిరిగి ప్రచారానికి పూనుకుంటున్నారు. ఎన్నికలకు ఇంకా 13 రోజులు మాత్రమే సమయం మిగిలి ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో తమ అభ్యర్థుల గెలుపును బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి మల్లు రవిని ఎంపీలుగా గెలిపించుకొని తీరాలని ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ.. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ గెలుపునకు ఆ పార్టీ తరపున సాక్షాత్తు ప్రధాని నరేంద్రమోదీ రంగంలోకి దిగి పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. ఇటీవల అభ్యర్థి నామినేషన్ సందర్భంగా గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపును ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించి పార్టీ నేతలు, కార్యకర్తల్లో జోష్ తీసుకొచ్చారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రాల్లో నిర్వహించిన భారీ రోడ్‌షోలకు ప్రజల నుంచి వచ్చిన స్పందనతో ఈ రెండు స్థానాల్లో తమ పార్టీ గెలుపుపై ధీమాను ప్రదర్శించారు.

ప్రధాన అస్త్రంగా 'పాలమూరు'

ఇటీవల అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ బరిలోనూ పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పార్టీలకు ప్రధాన ప్రచార అస్త్రంగా మారింది. ఈ ప్రాజెక్టు కేంద్రంగా ఆయా పార్టీలు హామీలు, విమర్శలు, ప్రతి విమర్శలను గుప్పిస్తున్నాయి. ఇటీవల బిజినేపల్లి జనజాతర సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి తమ పాలనలో కేవలం నాలుగున్నరేళ్లలో ఎన్ని కోట్లు ఖర్చయినా పాలమూరు ప్రాజెక్టు పూర్తిచేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కొడంగల్– పేట ఎత్తిపోతల కోసం రూ.4 వేల కోట్లతో పనులు ప్రారంభించినట్టు గుర్తుచేశారు. అలాగే పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకుండా, ఆర్థిక సాయం చేయకుండా కేంద్రంలో ఉన్న బీజేపీ అన్యాయం చేసిందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శలు గుప్పించారు. మళ్లీ తామే అధికారంలోకి వస్తామని.. అప్పుడు ప్రాజెక్టును పూర్తి చేసుకుందామని నాగర్‌కర్నూల్ రోడ్‌షోలో వ్యాఖ్యానించారు. బీజేపీ సైతం ఈ అంశాన్నే అస్త్రంగా చేసుకుని ఎన్నికల ప్రచారం చేస్తోంది. తాను మంత్రిగా ఉన్నప్పుడే కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషిచేశానని, సాగునీటి ప్రాజెక్టులకు తానే బీజం వేశానని డీకే అరుణ ప్రచారం చేస్తున్నారు.

భగ్గుమంటున్న భానుడు

ఉమ్మడి జిల్లాలో భారీగా పెరిగిన వగటి ఉష్ణోగ్రతలు

- వలుబోట్ల 44 డిగ్రీల సెల్సియస్ నమోదు
- వడగాల్పులు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన



సాక్షి, నాగర్‌కర్నూల్: ఉదయం 9 గంటలకే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. మండుటెండ, వడగాల్పులు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలో పనిచేసే కూలీలు, వీధి వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నచింతకుంట, జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలాల్లో ఉష్ణోగ్రతలు అత్యధికంగా 44.2 డిగ్రీలకు చేరాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వడగాల్పుల ప్రమాదం..

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఆదివారం నుంచి ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఈ నెల 30 వరకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేసింది. ఈ ప్రాంతాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎట్టి పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. వేడిగాలుల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా తరచుగా తగినంత నీరు తాగాలని, నిమ్మకాయ నీరు, మజ్జిగ తీసుకోవాలని చెబుతున్నారు.

వనపర్తి జిల్లాలో ఆదివారం నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత
కొత్తకోట	43.9
పాన్‌గల్	43.7
శ్రీరంగాపూర్	43.4
మదనాపురం	43
చిన్నంబావి	42.8
నాగర్‌కర్నూల్ జిల్లాలో..	
కోడేరు	43.7
బిజినేపల్లి	43.3
అచ్చంపేట	42.5
నాగర్‌కర్నూల్	41.9
కొల్లాపూర్	41.9
మహబూబ్‌నగర్ జిల్లాలో..	
చిన్నచింతకుంట	44.2
మూసాపేట	43.4
బాలానగర్	43.2
మిడ్జిల్	43
గండేడ్	42.9
జోగుళాంబ గద్వాల జిల్లాలో..	
ధరూర్	44.2
ఇటిక్యాల	44.0
అలంపూర్	43.9
గద్వాల	43.2
ఉండవెల్లి	43.1
నారాయణపేట జిల్లాలో..	
ఊట్కూరు	43.8
దామరగిద్ద	42.8
గుండుమాల్	42.6
ధన్వాడ	42.5
కృష్ణా	42.0

■ మాడుపగిలే ఎండకు తోడు వడగాల్పులు వీస్తుండటంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేడి గాలులకు తాళలేక ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్లకు అతుక్కుపోవాల్సి వస్తోంది. తీవ్రమైన ఎండల ప్రభావంతో పాడి పశువులు, మూగజీవాల పరిస్థితి సైతం దయనీయంగా మారింది. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం సింగవరంలో తెలుగు వెంకటయ్యకు చెందిన నాలుగు లేగదూడలు వడదెబ్బకు గురై మృతిచెందడం ఎండ తీవ్రతకు అద్దం పడుతోంది.

అభివృద్ధికి పట్టం కట్టండి



మాట్లాడుతున్న ఎంపీ రాములు, పక్కన బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిలో తన భాగస్వామ్యం ఉందని.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను ఆదరించాలని ఎంపీ పోతుగంటి రాములు కోరారు. ఆదివారం మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇప్పలపల్లి, ఉడిమిళ్ల, మారడుగు, చిట్లంకుంట, వంకేశ్వరం, అమ్రాబాద్, కుమ్మరోనిపల్లి తదితర గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా మంత్రిగా, ఎంపీగా ఆశీర్వదించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతతో అభివృద్ధి చేశానన్నారు. అదే బాటలో బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ఉంటాడని.. ఎన్నికల్లో ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మల్లేష్, రాజు, రామోజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో జిల్లా క్రీడాకారిణికి గోల్డ్‌మెడల్

నాగర్‌కర్నూల్ క్రైం: ఈనెల 27న దుబాయ్‌లో నిర్వహించిన 400 మీటర్ల రిలే ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్ పరుగు పందెంలో జిల్లా కేంద్రానికి చెందిన సాయి సంగీత బంగారు పతకం సాధించిందని క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి రమణ, ప్రధాన కార్యదర్శి ఖాజా, కోశాధికారి కిరణ్ హర్షం వ్యక్తంచేశారు.



సాయి సంగీత

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



బీరప్ప ఉత్సవాల్లో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తెలకపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గట్టునెల్లికుదురు గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీరప్ప ఉత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా కుర్వ డోలు వాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అనేక పండుగలు మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకొని సన్మార్గంలో పయనించాలని కోరారు. కాగా, బీరప్ప ఉత్సవాల్లో భాగంగా మహిళలు బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య తదితరులు ఉన్నారు.

రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ కుట్ర



ఐనోల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా. మల్లు రవి, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేట మండలం ఏజెన్సీ గ్రామాలైన బక్కలింగాయపల్లి, మన్నెవారిపల్లి, అక్కారం, ఘన్‌పూర్, ఐనోల్, బొమ్మనపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐనోల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. దళితుల ఆత్మగౌరవాన్ని మాజీ సీఎం కేసీఆర్ వద్ద తాకట్టు పెట్టిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రజలెవరూ నమ్మరన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు బొమ్మ బొరుసులాంటివన్నారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితం నాగర్‌కర్నూల్ ప్రాంతంతో ముడిపడి ఉందని అన్నారు. రెండు పర్యాయాలు ఎంపీగా ప్రాతినిధ్యం వహించి ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంత్రియానాయక్, రాముయాదవ్, మాజీ ఎంపీపీ రామనాథం పాల్గొన్నారు.

సీతారామస్వామికి పల్లకీసేవ



సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామికి ఆదివారం పల్లకీసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో అభిషేకం, సహస్రనామార్చన పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీలో ఊరేగింపుగా హనుమాన్ ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ ఉత్సవ మూర్తులను భద్రపర్చనున్నట్లు అర్చకులు తెలిపారు.

– చారకొండ

సర్కార్ బడులపై నజర్

- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు
- జిల్లాకు రూ. 40 కోట్లు మంజూరు
- జూన్ 10వ తేదీలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశాలు
- అమ్మ ఆదర్శ కమిటీలతో మౌలిక వసతులు కల్పించేలా ప్రణాళిక



అమ్రాబాద్ ప్రాథమిక పాఠశాల

అచ్చంపేట: ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. వారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఏ పాఠశాలలో ఏ అవసరాలు కల్పించాలన్న విషయమై నివేదికలు రూపొందించిన అధికారులు.. అందుకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. వేసవి సెలవుల్లో ఆయా పనులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

స్పెషల్ డెవలప్‌మెంట్, 'ఉపాధి' నిధులతో..

కలెక్టర్ ఆధీనంలో ఉండే స్పెషల్ డెవలప్‌మెంట్ (డీఎంఎఫ్) నిధులతో పాటు ఉపాధి హామీ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు అన్ని పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం కల్పించి, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు అమర్చనున్నారు. అవసరమైన చోట తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని 825 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రూ. 40 కోట్ల విలువైన పనులు చేపట్టనున్నారు. కాగా, పాఠశాలల్లో చేపట్టే రూ.లక్షలోపు పనులకు ఎంపీడీఓలు.. రూ.లక్ష దాటితే కలెక్టర్ల ద్వారా బిల్లులు చెల్లించనున్నట్లు తెలిసింది.

వేసవి సెలవులు పూర్తయ్యేలోగా..

వేసవి సెలవులు పూర్తయ్యేలోగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇటీవల కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులపై దిశానిర్దేశం చేశారు. మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఆదేశించారు. ఈమేరకు సకాలంలో పనులు పూర్తిచేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

శానిటేషన్ సిబ్బంది లేక అవస్థలు..

గతంలో శానిటేషన్ సిబ్బందిని నియమించుకుని పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయించేవారు. గత ప్రభుత్వం శానిటేషన్ సిబ్బందిని తొలగించి, పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆయా బాధ్యతలను అప్పగించింది. అయితే చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది తక్కువగా ఉండటంతో పాఠశాలలను పట్టించుకోవడం లేదు. పట్టణాల్లోనూ పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత తమది కాదన్నట్లే మున్సిపాలిటీలు వ్యవహరిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ బడుల్లోని మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నత్తనడకన 'మనఊరు - మనబడి'

సర్కార్ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గత ప్రభుత్వం మనఊరు–మనబడి కార్యక్రమం చేపట్టింది. మొదట్లో ఆర్భాటంగా ప్రారంభమైన పనులు.. ప్రస్తుతం నత్తకే నడక నేర్పుతున్నాయి. జిల్లాలో 825 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. మొదటి విడతలో 290 స్కూళ్లకు రూ.70 కోట్లు మంజూరుచేసింది. అందులో కేవలం 70 పనులు పూర్తి కాగా.. 220 పాఠశాలల్లో కొన్ని పనులు మాత్రమే పురోగతిలో ఉన్నాయి. మరికొన్ని పనులు ప్రారంభం కాలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

రూ. 40 కోట్లు మంజూరు..



అన్ని పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేస్తున్నాం. కొత్త కమిటీలకు బ్యాంక్ అకౌంట్లు తీస్తున్నారు. పాఠశాలల్లో సివిల్ పనులకుగాను రూ. 40 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే గుర్తించిన పనులను కొత్త కమిటీలు జూన్ 10వ తేదీలోగా పూర్తిచేయాల్సి ఉంటుంది.

– గోవిందరాజులు, డీఈఓ

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొత్తకోట రూరల్: మండలంలోని ముమ్మళ్లపల్లి సమీపంలో జాతీయ రహదారి–44 పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మగవ్యక్తిగా గుర్తించడంతో పాటు వయస్సు దాదాపు 30ఏళ్లు ఉండవచ్చని, గురువారం లేదా శుక్రవారం చనిపోయి ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మృతుకి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతదేహంపై షర్ట్ లేకుండా ఉండటంతో పాటు మృతుడు జంజరం ధరించి ఉన్నాడని, ఇందుకు సంబంధించి ఎక్కడైనా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయో అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం చేరవేస్తామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా సంబంధీకులు ఉంటే 8712670621 నంబర్‌కు ఫోన్ చేయడంతో పాటు కొత్తకోట పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని అన్నారంకు చెందిన మల్లికార్జున్‌గౌడ్ (35) శనివారం తన స్వగ్రామం నుంచి బీచుపల్లి పుణ్యక్షేత్రానికి వెళ్లాడు. దర్శనం అనంతరం తన అత్తగారి ఊరైన ఉండవెల్లికి వెళ్లేందుకు రాత్రి జాతీయ రహదారిపై చేగువేరా హోటల్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ..

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని గొర్లోనిబాయిలో కావాలి అంజిలయ్యకు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసినా ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. భూనీడ్ గ్రామ శివారులోని రైతు తన పొలంలో పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. దుప్పట్‌గట్ గుట్టల్లో సంచరిస్తున్న చిరుత దాడి చేయడంతోనే లేగదూడ మృతి చెందినట్లు గుర్తించామని తెలిపారు.

ఇంటి తాళం విరగొట్టి ఆభరణాలు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంటి తాళం విరగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా.. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన నాగమ్మ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి ఇంటి ఎదుట నిద్రించింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలోని తులం బంగారు, 15తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచి చూడటంతో బీరువా తెరిచి ఉండగా, బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించింది. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బంగారం, నగదు..

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో 3తులాల బంగారు, రూ.25వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు అనిల్‌కుమార్ ఆదివారం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈనెల 25న బంధువుల శుభకార్యానికి వెళ్లి తిరిగి శనివారం రాత్రి ఇంటికి చేరుకుని చూడగా బీరువా చిందరవందర చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. వెనక తలుపు విరగొట్టి చోరీకి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు.

అకారణంగా దాడి చేశారని ఫిర్యాదు

జడ్చర్ల: మండలంలోని మాచారం చెందిన మొగిలి రాజశేఖర్‌పై అకారణంగా దాడి చేశారని ఆదివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు. శనివారం రాత్రి పనిముగించుకుని ఇంటికి వెళ్తుండగా పానుగంటి చెన్నయ్య, కృష్ణవేణి, కావేరి, గణేష్, శివ దాడిచేశారని, తన అన్న రాజు, రవి వచ్చి విడిపించేందుకు ప్రయత్నించారని తెలిపారు. వారిని కూడా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీఫాం గండం!

- అలంపూర్‌కు అచ్చిరాని బీఫారాలు
- 2009లో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు దక్కని బీఫాం
- 2023లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేకు అదే పరిస్థితి
- ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మందాకు నిరాశే



ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ / మాజీ ఎంపీ మందా జగన్నాథం / మాజీ ఎమ్మెల్యే వీఎం అబ్రహం

అలంపూర్: రాజకీయాల్లో బీఫాం కీలకమైనది. పార్టీలలో ఏళ్ల తరబడి నిబద్ధతగా పనిచేసిన వారికి బీఫాం ఒక గుర్తింపునిస్తోంది. బీఫాం దక్కించుకున్న వారు ప్రత్యక్ష రాజకీయాల్లో ఆ పార్టీ తరపున పోటీ చేయడానికి అవకాశం దక్కుతుంది. ప్రధాన పార్టీలు ఇచ్చే బీఫాం ఆ నాయకుడి రాజకీయ భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుంది. వ్యక్తిగా ఉన్న క్రేజ్‌తో పాటు బీఫాం దక్కితే పార్టీ బలం తోడవుతుంది. అందుకే పార్టీ అభ్యర్థి ప్రకటనతో పాటు బీఫాం తప్పనిసరిగా మారింది. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు పార్టీలు ఇచ్చే బీఫాం కోసం విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. అందుకోసం పార్టీకి విధేయులుగా ఉంటారు. పార్టీ నుంచి బీఫాం అందితే పోటీలో గెలిచినంత సంబరాలు చేసుకుంటారు. ఏ ఎన్నికలో అయినా అభ్యర్థుల ఖరారు, పార్టీ బీఫాం అనేది సర్వసాధారణంగా జరిగే ప్రక్రియ కాగా.. అలంపూర్ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థులకు మాత్రం బీఫాం అంటేనే గుండె దడ అన్నంత పనిగా మారింది. అందుకు కారణం గత ఎన్నిక నుంచి ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఫాం గండాలు ఎదుర్కొవడమేనని చెప్పవచ్చు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

2009 నుంచి ఇదే పరిస్థితి..

2009 అసెంబ్లీ ఎన్నికల్లో అయిజ మండలం చిన్న తాండ్రపాడుకు చెందిన ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను అప్పటి కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈక్రమంలో అనూహ్యంగా ఇటిక్యాల మండలం వల్లూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే వీఎం అబ్రహం తెరపైకి వచ్చారు. అభ్యర్థుల మార్పులు జరిగి కాంగ్రెస్ బీఫాంతో నామినేషన్ దాఖలు చేశారు. అప్పటి వరకు అభ్యర్థిగా ఉన్న సంపత్ కుమార్‌కు నిరాశే మిగిలింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలను అభ్యర్థులుగా ప్రకటించారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న అబ్రహం అనుచర వర్గం సంబరాలు నిర్వహించింది. కానీ నామినేషన్ల ప్రక్రియ జరగడానికి ముందే అనూహ్యంగా ఉండవెల్లి మండలం పుల్లూరుకు చెందిన విజయుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. బీఆర్ఎస్ నుంచి బీఫాం అందుకొని నామినేషన్ దాఖలు చేశారు. 2009 నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఫాం గండం వెంటాడుతుండటంతో స్థానిక నేతలు భవిష్యత్ రాజకీయాలపై మదనపడుతున్నారు.

అభ్యర్థిత్వం ఖరారైనప్పటికీ అందని బీఫాం..

అలంపూర్ నియోజకవర్గంలో ఆయా పార్టీల నుంచి పోటీ చేయాలని భావించిన వారు అభ్యర్థులుగా ఖరారైనప్పటికీ.. నామినేషన్ సమయంలో జరిగే అనూహ్య మార్పులతో బీఫాంలు దక్కక పోటీకి దూరమవుతున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు, పరిశీలన తిరస్కరణ, ఆమోదం వంటి కీలక ఘట్టాలు ముగిశాయి. ఈ ప్రక్రియల్లో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిజర్వుడు స్థానానికి ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన మాజీ ఎంపీ మందా జగన్నాథం ఈనెల 25న బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. 26వ తేదీన జరిగిన నామినేషన్ పత్రాల పరిశీలనలో ఆయన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. అందుకు బీఫాం ఇవ్వకపోవడం కారణంగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఎస్పీలో చేరిన మందా జగన్నాథం.. పార్లమెంట్ బరిలో ఉంటారని ఆయన అభిమానులు భావించారు. కానీ పార్టీ బీఫాం అందజేయకపోవడంతో పోటీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బీఎస్పీ నుంచి మరో అభ్యర్థి బరిలో ఉండటంతో మందాకు ఆ పార్టీ బీఫాం దక్కలేదని చెప్పవచ్చు.

'జోగుళాంబ'కు అపకీర్తి



అలంపూర్ ఆలయాల సముదాయం

- మే1న యాగాలు అంటూ ప్రచారం
- ఒక్కొక్కరి గోత్రనామాలకు రూ.5వేలు వసూలు
- ఎలాంటి అనుమతులు లేవు: జోగుళాంబ ఆలయాల ఈఓ
- ఆలయంపేరు వాడుతూ గతంలోనూ ఇలాంటి ఘటనలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో లోకకల్యాణార్థం పాశుపత రుద్రహోమ, సహిత చండీయాగాలు మే1న చేస్తున్నామని బ్రోచర్ ప్రచురించి మరీ జోరుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పలువురు భక్తులు జోగుళాంబ ఆలయ కార్యాలయానికి సంప్రదించి యాగాలు నిజమేనా అంటూ ఆరా తీశారు. అనుమానం వచ్చిన దేవస్థానం వారు సామాజిక మాధ్యమాలలో వచ్చిన ఫోన్ నంబర్ తీసుకుని తమను భక్తుడిగా పరిచయం చేసుకుని వివరాలు అడిగారు. దీంతో సదరు నిర్వాహకులు నిజమేనని, అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. రూ.5,116 చెల్లిస్తే యాగంలో గోత్రనామాలు చెప్పేందుకు తీసుకుంటున్నామన్నారు. శ్రీలంక, నేపాల్ ఇలా అన్ని చోట్ల చేసేందుకు సుమారు రూ.9లక్షల దాక తమకు ఖర్చు అవుతుందని సమాధానం ఇచ్చారు. ఒక వెండి బిళ్ల, రుద్రాక్ష కూడా ఇస్తామని చెప్పారు.

ప్రైవేట్ వ్యక్తులకు అనుమతులు ఉండవు

దేవస్థానం వారు లోక కల్యాణార్థం ఏదీ తలపెట్టినా అది అధికారికంగా నిర్వహిస్తారే తప్ప ప్రైవేట్ వ్యక్తులచే కార్యక్రమాలు అప్పగించరు. ఇలాంటి వాటికి దేవస్థానానికి సంబంధం ఉండదు. ఆలయం తరపున ప్రతి శుక్రవారం, అమావాస్య, పౌర్ణమిలలో చండీహోమాలు, మాస శివ రాత్రికి రుద్రహోమాలు, ఆరుద్ర నక్షత్రం రోజున ఆరుద్రోత్సవాలు ఇలా అన్నీ కార్యక్రమాలు కూడా కల్యాణార్థం దేవస్థానం వారే నిర్వహిస్తుంటారు.

ఎవరూ సంప్రదించలేదు



మే1న చండీయాగాలు, రుద్రయాగాలు అంటూ వస్తున్న ప్రచారాలు దేవస్థానంకు ఎలాంటి సంబంధం లేదు. అయితే ఈ యాగలను ఆలయంలో చేస్తున్నామని ఆలయం పేరు వాడుకున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమాల కోసం ఇప్పటి దాకా ఎవరూ అనుమతులు తీసుకోలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

ఫోన్‌లో మాట్లాడారు



ఆదివారం ఉదయం నాతో ఫోన్‌లో ఎవరో అయ్యవార్లమని మాట్లాడారు. వనపర్తి నుంచి వస్తారు.. చేస్తారు.. అంటూ ఒక గ్రామానికి చెందిన నాయకుడు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులు అలా వారంతకు వారు చేసుకోవడానికి ఇక్కడ అనుమతులు ఉండదు. ఏం కార్యక్రమాలు చేస్తున్నారో ఒకసారి మా దేవస్థానం అర్చకులతో మాట్లాడమని చెప్పాను.

– చిన్న కృష్ణయ్య, ఆలయ చైర్మన్

గతంలోనూ ఇలాంటి మోసాలు

కొందరు అలంపూర్ పుణ్యక్షేత్రం పేరు వాడుకుని పలు మోసాలకు పాల్పడిన ఘటనలు దేవస్థానం వారు గతంలోనూ గుర్తించారు. వడ్డేపల్లి మండలంలో అయ్యప్ప భక్తుల ముసుగులో వెళ్లి అలంపూర్‌క్షేత్రంలో అన్నదానాలు చేస్తున్నామని నకిలీ రశీదులు సృష్టించి డబ్బులు వసూలు చేశారు. మరికొంత మంది తమ వెబ్‌సైట్ ద్వారా అలంపూర్ క్షేత్రంలో నిర్వహించే పలు పూజలకు ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే ప్రసాదాలు కూడా పంపుతామని ఏకంగా పత్రికప్రకటనలు ఇచ్చారు. మరికొంత మంది అలంపూర్‌లో త్రిశక్తి పీఠం నిర్వాహకులుగా చెప్పి పలు మోసాలకు పాల్పడ్డారు. వీటన్నింటిని దేవస్థానం వారు గుర్తిస్తూ అరికట్టుకుంటూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా మే1వ తేదీన జోగుళాంబ ఆలయంలో యాగాలు అంటూ వస్తున్న వార్తలు దేవస్థానం వారికి కొత్త తలనొప్పి తెచ్చిపెట్టాయి.

మున్సిపల్ కమిషనర్ పేరిట మోసం

- హోటళ్లకు ఫోన్లు చేసి డబ్బులు వసూలు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం: మున్సిపల్ కమిషనర్‌నని హోటల్ పన్నులు, ఇతర అనుమతులకి డబ్బులు కట్టాలంటూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదివారం ఈ ఘటనపై వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా బి.కోడూర్ మండలం రామచంద్రపురం చెందిన బిల్ల నాగేశ్వరరావు కడప జిల్లాలోని మున్సిపాలిటీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో పలు రెస్టారెంట్స్, హోటళ్ల నిర్వాహకులు మున్సిపల్ కార్యాలయం నుంచి రెన్యూవల్, అనుమతి తదితర వాటిని ఎలా తీసుకుంటారో తెలుసుకున్నాడు. ఇదే అనుభవంతో తన మొబైల్ నంబర్‌ను ప్రభుత్వ అధికారిగా ట్రూ కాలర్‌లో నమోదు చేసుకున్నాడు. దీంతో పలు వ్యాపార సముదాయాల యాజమానులకు మున్సిపల్ కమిషనర్‌గా మాట్లాడుతూ రెస్టారెంట్స్, హోటల్స్ పరిమితి గడువు ముగిసిందంటూ హెచ్చరికలు జారీ చేస్తూ వారి నుంచి డబ్బులు కాజేస్తున్నట్లు వివరించారు. ఇదే తరహాలో గద్వాల పట్టణంలోని శరత్‌చంద్రరెడ్డి ఫుడ్‌వరల్డ్ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈ వ్యక్తికి గద్వాల మున్సిపల్ కమిషనర్‌గా ఈ నెల 16వ తేదీన (6305468441) ఫోన్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. హోటల్ అనుమతి ముగిసినా రెన్యూవల్ చేసుకోలేదని, ప్రతి విషయం మేము గుర్తు చేయాల్సి వస్తే ఎలా? అంటూ చీవాట్లు పెట్టి భయాందోళనకు గురి చేశాడన్నారు. ఇది నిజమే అనుకున్న యాజమాని గడువు ఇస్తే 17వ తేదీన మున్సిపాల్ కార్యాలయంలో రెన్యూవల్ చేయిస్తామని బదులు ఇచ్చినప్పటికీ లేదంటూ.. తప్పనిసరిగా ఇప్పడే ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాల్సిందేనని కలెక్టర్ ఆదేశాలంటూ చెప్పాడు. 9080489174కు రూ.3,400 నగదును ఫోన్ పే ద్వారా వేయించుకున్నాడు. మరుసటి రోజు 17వ తేదీన వాట్సాప్ వాయిస్ మేసేజ్ చేస్తూ అదనంగా రూ.500 చెల్లిస్తే కార్యాలయ సిబ్బంది రెన్యూవల్ పత్రాలు అందజేస్తారని చెప్పాడు. నిందితుడు యజమానికి ఫోన్ చేయగా అనుమానంతో గట్టిగా నిలదీయడంతో నిందితుడు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. బాధితుడు అదే రోజు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీన గద్వాల బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఫోన్‌లు చేస్తూ ఆన్‌లైన్‌లో నగదు వసూలు చేసినట్లు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని రెండు సెల్‌ఫోన్స్, రెండు సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకుని గద్వాల కోర్టులో హాజరుపరిచి అదేరోజు రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఛేదనలో సీఐ భీమాకుమార్, పట్టణ ఎస్ఐ శ్రీనివాస్‌లు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలోని పలు జిల్లాలో కేసులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు.

ఖైదీలూ ఓటేయొచ్చు

అచ్చంపేట: సార్వత్రిక ఎన్నికల్లో ఖైదీలు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ప్రిమెంట్ డిటర్మినేషన్ కింద వివిధ నేరాల్లో జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు కూడా ఓటు హక్కు కల్పించారు. ఖైదీలు ఓటు వేయాలంటే.. తాము ఓటర్లమని, తమకు ఫలానా నియోజకవర్గంలో ఓటు హక్కు ఉందని, దానిని వినియోగించుకుంటామని జైలర్‌కు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఇలా దరఖాస్తు చేసుకున్న వారికి జైలర్ ఆయా ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్ తెప్పిస్తారు. తద్వారా ఖైదీకి సంబంధించిన నియోజకవర్గంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

భారీగా పట్టుబడుతున్న నగదు, మద్యం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. అక్కడక్కడ భారీగా నగదుతో పాటు మద్యం పట్టుబడుతుండగా స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలిస్తున్నారు.

చారకొండలో రూ.2.52 లక్షలు..

చారకొండ: మండల కేంద్రంలోని కల్వకుర్తి–దేవరకొండ ప్రధాన రహదారిపై ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీ నిర్వహించారు. సాయంత్రం వేళ డిండి నుంచి దేవరకొండకు వెళ్తున్న అల్లంపల్లి అరుణ్‌కుమార్ ద్విచక్ర వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా రూ.2.52 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్ఐ వివరించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసి జిల్లా గ్రీవెన్స్‌కు అప్పగించినట్లు తెలిపారు.

మన్ననూరులో రూ.50 వేలు..

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ సరిహద్దులోని చెరువుకొమ్ము లింగమయ్య అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేసుకొని నిత్యం వాహన తనిఖీ చేపడుతున్నారు. ఆదివారం మహారాష్ట్రాకు చెందిన ఓ కారును తనిఖీ చేయగా రూ.50 వేలు పట్టుబడినట్లు అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేసినట్లు వివరించారు. తనిఖీల్లో 2వ ఎస్ఐ ఖాద్రీ, పోలీసులు పాల్గొన్నారు.



మన్ననూరులో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మద్యం పట్టివేత..

అలంపూర్: తెలంగాణ సరిహద్దులోని పుల్లూరు టోల్‌గేట్ వద్ద చిరు వ్యాపారులు మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తుండగా ఆదివారం పోలీసులు దాడులు జరిపారు. 300.870 లీటర్ల మద్యం పట్టుబడిందని, దీని విలువ రూ.1,48,170 ఉంటుందని హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు వివరించారు.

పొలంలో భారీ మొసలి పట్టివేత



భారీ మొసలిని తీసుకొస్తున్న యువకులు, హోంగార్డు కృష్ణసాగర్

కొత్తకోట రూరల్: ఎండల తీవ్రతకు చెరువులు, కుంటలు అడుగంటిపోవడంతో నీటిలో ఉండాల్సిన మొసలి వరి పొలంలోకి వచ్చింది. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం బూత్‌కూర్ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు నాగరాజు ఆదివారం ఉదయం వరి పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో భారీ మొసలి కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. గ్రామస్తుల సహకారంతో జిల్లా కేంద్రంలో హోంగార్డు, స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న ఆయన గ్రామస్తుల సహకారంతో దాదాపు రెండు గంటల పాటు శ్రమించి తాళ్లతో మొసలిని బంధించి గ్రామానికి తీసుకొచ్చారు. మొసలి 185 కేజీల బరువు ఉంటుందని తెలిపారు. మొసలిని ట్రాక్టర్‌లో తరలించి జూరాల ప్రాజెక్టులో వదిలినట్లు కృష్ణసాగర్ చెప్పారు. గొర్రెల కాపరికి చెందిన రెండు గొర్రెలను మరో రైతుకు చెందిన ఆవుదూడను మొసలి తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నది పరివాహక ప్రాంతాలలో ఉండే రైతులు, గొర్రెల, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మరణంలోనూ వీడని బంధం

- చికిత్స పొందుతూ భార్యాభర్తలు మృతి
- మక్తల్‌లోని కేశానగర్‌లో విషాదం



బైని లక్ష్మి, హన్మంతు (ఫైల్)

మక్తల్: వారిద్దరూ భార్యాభర్తలు. ఒకరికొకరు తోడూ నీడగా బతికారు. ఇటీవల దైవదర్శనార్థం ఆటోలో వెళ్లి వస్తుండగా.. రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఇరువురు తనువు చాలించారు. ఈఘటన మక్తల్ పట్టణంలోని కేశానగర్‌లో తీవ్ర విషాదం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని కేశానగర్‌కు చెందిన బైని లక్ష్మి (58), హన్మంతు (60) భార్యాభర్తలు. వారికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఈనెల 23న గద్వాల జములమ్మ దర్శనార్థం లక్ష్మి, హన్మంతు ఆటోలో వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. మక్తల్ మండలం రుద్రసముద్రం సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి.. హన్మంతును మక్తల్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించి మొదట లక్ష్మి మృతిచెందగా, విషయాన్ని భర్త హన్మంతుకు తెలియజేశారు. ప్రమాదంలో అయిన గాయాలకు తోడు భార్య మృతిని తట్టుకోలేక ఆయన కూడా తనువు చాలించారు. ఒకే రోజు భార్యాభర్తల మృతితో కేశానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ముందుగా లక్ష్మి, హన్మంతు పార్థివదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న ఎల్ఐసీ ఐసీఈయూ రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఎల్ఐసీ ఐసీఈయు రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'పార్లమెంట్ ఎన్నికలు – కార్మికవర్గం కర్తవ్యం' అంశంపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనలో కార్మిక చట్టాలన్నీ యాజమాన్యాలకు చుట్టాలుగా మారాయన్నారు. నల్ల చట్టాలను రద్దుచేయాలని ఆందోళన చేపట్టిన 750 మంది రైతుల చావుకు కారణమయ్యారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే మేధావులు, కళాకారులు, కవులను జైలుపాలు చేశారన్నారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛ, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. అణగారిన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీని చిత్తుగా ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్ మాట్లాడుతూ బీజేపీ హయాంలో ఎవరికి రక్షణ లేకుండా పోయిందన్నారు. అసమానతలు తీవ్రంగా పెరిగాయని తెలిపారు. దేశ సంపద కార్పొరేట్లకే పరిమితమైందని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, సత్యన్న, చంద్రకాంత్, రాజ్‌కుమార్, గాలెన్న, రాములు, రామ్మోహన్‌రావు, రాజేశ్వర్, ఆంజనేయులు, కేశవులు, అలివేల ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

మదనాపురం: పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి అధిష్టానానికి కానుకగా ఇవ్వాలని కోరారు. గత రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక రకాలుగా పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందని.. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఒక్కరితో ఓటు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగన్న, ఎంపీపీ పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు శరత్‌రెడ్డి, నాయకులు టీసీ నాగన్న యాదవ్, జగదీశ్, కృష్ణ, రామకృష్ణ, మహేష్, హనుమాన్‌రావు, అక్కల మహదేవన్‌గౌడ్, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజాద్ అలీ, వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి